క్లుప్తంగా

వాటర్ ఫిల్టర్ వితరణ



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి అప్ సబ్ కి అవాజ్ సంస్థ వాటర్ ఫిల్టర్ మిషన్‌ను వితరణగా అందజేసింది. శుక్రవారం దీనిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం సంస్థ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మొల్లి అప్పారావు, తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్, డీటీ చేతన్‌కుమార్, ఆర్‌ఐ రవికృష్ణ, సంస్థ ప్రెసిడెంట్ వడ్లమూడి శివ, సెక్రటరీ బి.కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కె.భాస్కర్, కోశాధికారి జోగేంద్ర సాయి, సభ్యులు బాలాజీ, వైజాగ్ బ్లడ్ డోనర్ క్లబ్ ప్రెసిడెంట్ రవి, రాజ్‌కుమారి, తాహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ దుకాణాల తొలగింపు

మల్కాపురం : ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లపై అనధికారికంగా నిర్వహిస్తున్న దుకాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. జింక్ గేటు నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్లపై చిరు వ్యాపారులు ఫ్రూట్స్, టిఫిన్ సెంటర్, నూడిల్స్ స్టాళ్లు, తందూరీ పాయింట్స్, రడీమేడ్ వస్త్రాల దుకాణాలు ఏర్పాటు చేసి దర్జాగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వచ్చే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు శుక్రవారం ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్లపై ఉన్న అనధికారిక దుకాణాలను తొలగించారు. అయితే తొలగింపుల్లో కూడా అధికారులు పక్షపాతం చూపారన్న ఆక్షేపణలున్నాయి. నాయకుల సిఫార్సు లున్న వారి షాపుల జోలికి పోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజల మనిషి సుందరయ్య



మల్కాపురంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం : కమ్యూనిస్ట్ ఉద్యమ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో సీపీఎం నాయకులు శుక్రవారం నిర్వహించారు. మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉరుకూటి బాబూరావుయాదవ్, పెంటారావు, ఐద్వా నాయకులు విమల తదితరులు పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీకి, నిరుపేదల సేవల్లో తరించిన ప్రజల మనిషని, ఆయన అందించిన సేవలను కొనియాడారు. 58వ వార్డు గుల్లలపాలెం, 59వ వార్డు నెహ్రూనగర్ ప్రాంతాల్లో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను ఆ పార్టీ నాయకులు నిర్వహించారు.

విద్యార్థులకు సంగీతంలో శిక్షణ

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు సంగీతంపై శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక వేత్త డి.కామేశ్వరరావు మాట్లాడుతూ జీవిత అధ్యయనంలో సంగీతం ఒక భాగమని, సాధనతోనే ఏదైనా సాధించగలమని విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు మెడిటేషన్, నీతి కథలు నేర్పించారు. కార్యక్రమంలో కార్మికనేత సీహెచ్.ఎస్ఎన్.రాజు, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, ఉద్యోగి ఎల్లమ్మ, న్యాయవాది కె.రామకృష్ణ, వక్త భాను, పాఠకులు బి.సూర్యమోహన్, ఎం.అజయ్, కిరణ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆటవిడుపు

- పార్కుల అభివృద్ధికి జీవీఎంసీ ప్రత్యేక చర్యలు
- నిర్లక్ష్యానికి గురైన పార్కులకు నూతనోత్తేజం



పచ్చదనంతో శాంతినగర్ పార్కు



పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు



కరాసా పార్కులో పిల్లల ఆటవస్తువులు

గోపాలపట్నం : పార్కులు పిల్లలకు ఆటస్థలాలు. పెద్దలకు విశ్రాంతి నిలయాలు. గత కొన్నేళ్లుగా పాలకులు నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన పార్కులు, ఇపుడు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. పార్కుల అభివృద్ధికి జీవీఎంసీ నిధులు వెచ్చిస్తుండటంతో పిల్లలు, పెద్దల వినియోగానికి అనుకూలంగా మారుతున్నాయి.

గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో 12 పార్కులు ఉన్నాయి. అందులో జీవీఎంసీ 52వ వార్డులో ఏడు, 90వ వార్డులో మూడు, 92వ వార్డులో రెండు పార్కులు ఉన్నాయి. 52వ వార్డులోని మర్రిపాలెం ఉడా లేఅవుట్‌లో గతంలో నిర్మించిన పార్కును అభివృద్ధి చేశారు. కొత్తగా మరో పార్కును నిర్మించారు. శాంతినగర్‌లో పెద్ద పార్కును పచ్చదనంతో సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. చాలా ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కరాసా పార్కులో పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో ఉదయం, సాయంత్రం పిల్లలు, పెద్దలతో పార్కు సందడిగా మారింది.

ఇక్కడ పచ్చదనం ఏర్పాటుకు అధికారులు మరిన్ని చర్యలు చేపడుతున్నారు. గౌరీనగర్, తారక రామా ఎన్‌క్లేవ్‌లో ఉన్న పార్కుల్ని అక్కడి వారికి కావలసిన విధంగా అభివృద్ధి చేశారు. 92వ వార్డు గోపాలపట్నం ఉడాకాలనీ పార్కులో ఇటీవల ఓపెన్ జిమ్ సామగ్రిని ఏర్పాటు చేశారు. దీంతో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్న స్థానిక నాయకులకు, జీవీఎంసీ అధికారులకు పరిసర ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు. పరుగులు తీసే ప్రపంచంలో కాస్త సేద తీరే స్థలాలు పార్కులేనని, వాటిని అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందంటున్నారు.

పంచతత్వ కాన్సెప్ట్‌తో అభివృద్ధి



90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ప్రత్యేకంగా పంచతత్వ కాన్సెప్ట్‌తో పార్కును నిర్మిస్తున్నాం. దీన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. సీతారామరాజునగర్ పార్క్‌లో గ్రీనరీ ఏర్పాటుకు రూ.20 లక్షలు వెచ్చిస్తున్నాం. కాకానినగర్‌లోని కనకమహాలక్ష్మినగర్ పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– బొమ్మిడి రమణ, కార్పొరేటర్, 90వ వార్డు

మోడల్ పార్కుగా శాంతినగర్ పార్క్



పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. 52వ వార్డు శాంతినగర్ పార్క్‌ను మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతున్నాం. వార్డులోని మిగిలిన పార్కుల్నీ అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పార్కు చుట్టూ ఉన్న ప్రహరీ గోడలకు అందమైన పెయింటింగ్స్ వేసి, ఆహ్లాదకరంగా మార్చుతాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

కుళాయి నీటిలో పురుగులు



చంద్రనగర్‌లో కుళాయి నీటిని వడగట్టగా వచ్చిన పురుగులు

గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో సరఫరా చేసిన కుళాయి నీటిలో శుక్రవారం పురుగులు రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. నీటి ధార కూడా చాలా తక్కువగా వస్తోందని వాపోయారు. ఈ ప్రాంతానికి నీటి సరఫరా బంటాకాలనీ వద్దనున్న గోదావరి బేలన్సింగ్ రిజర్వాయర్ ట్యాంక్ నుంచి జరుగుతుంది. అక్కడ ట్యాంక్ నిర్వహణపై కనీస చర్యలు కూడా లేకపోవడం వల్లే పురుగులు వచ్చినట్టు స్థానికులు మండిపడ్డారు. ఇలాంటి నీరు తాగి రోగాలు తెచ్చుకోమంటారా? అని స్థానిక అధికారులను ప్రశ్నించారు.

ట్యాంక్‌ను శుభ్రం చేయించాం

ట్యాంక్‌ను సరిగా క్లీనింగ్ చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని, తెలిసిన వెంటనే ట్యాంక్‌ను శుభ్రం చేయించినట్టు నీటి సరఫరా విభాగం ఏఈ రాజశేఖర్ తెలిపారు. ఇక్కడి నుంచి నీరందించే పైప్‌లైన్లన్నింటినీ శుభ్రం చేయనున్నట్టు పేర్కొన్నారు. అవసరమైన చోట్ల ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామన్నారు. ట్యాంక్‌ల క్లీనింగ్ పనుల్ని ఈఈ మాధవరావు, ఎస్ఈ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

చంద్రబాబును జనం నమ్మట్లేదు

- నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రహమాన్

గోపాలపట్నం : పెందుర్తి రోడ్డు షోలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సెంట్ ఇంటి స్థలంపై చేసిన వ్యాఖ్యల్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ పరిశీలకుడు, సీనియర్ నాయకుడు ఎస్ఏ రహమాన్ తీవ్రంగా ఖండించారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జనాలను మభ్యపెట్టి ఇళ్లు ఇవ్వకుండా డిపాజిట్లు సేకరించి మోసం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శనివారం సాయంత్రం 4 గంటలకు గోపాలపట్నం బంక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముఖ్య నాయకులు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

డాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్-2 నుంచి రెండు, జోన్-3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేదగాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

సింహాచలం: జీవీఎంసీ 94వవార్డు నాయుడులోని వేద గాయత్రీదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం నుంచి వరకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త రాపర్తి త్రివేణి వరప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి 8గంటల వరకు అమ్మవారి మేలుకొలుపు, నిత్యార్చన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, దీక్ష ధారణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి అష్టోత్తర శత కలశ స్థాపన, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మవారి మేలుకొలుపు, నిత్యార్చన, అగ్నికార్యం, సహస్ర గాయత్రీ మంత్ర హవనం, ఉపదేవతా సహిత నవగ్రహ మంత్ర సూక్తహవనాలు, మహా పూర్ణాహుతి, ప్రసాద వితరణ, వేద ఆశీర్వచనం ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి నారాయణసేవ(అన్నసమారాధన కార్యక్రమం) ఉంటుందని తెలిపారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

పోలీసులకు యోగా తరగతులు

దొండపర్తి : బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీసులకు యోగా తరగతులు నిర్వహించారు. పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడికి గురి కాకుండా మానసికంగా దృఢంగా ఉండేందుకు సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిత్యం వ్యాయామం చేస్తూనే యోగాపై దృష్టి సారిస్తే మానసిక ప్రశాంతత ఉంటుందని బ్రహ్మకుమారీస్ తెలిపారు. ఇందులో ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీ(ఏఆర్) ఆర్.పి.ఎల్.శాంతికుమార్, ఆర్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పని ఒత్తిడి నుంచి బయటపడి మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం, సిబ్బందికి మనోధైర్యం పెంపొందే పలు మార్గాలను బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు వివరించారు.

చిన్నారులకు నాట్యంలో శిక్షణ



నాట్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



నీతి కథలను శ్రద్ధగా వింటున్న చిన్నారులు

మల్కాపురం : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు నాట్యంలో శిక్షణతోపాటు, నీతి కథల్ని బోధించారు. శిబిరంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అలేఖ్య, లావణ్యలు పాల్గొని చిన్నారులకు నాట్యం నేర్పారు. వివిధ గేయాల ఆలాపనలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం కార్మిక నాయకుడు బి.సత్యానందం, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మిలు నీతి కథలను చిన్నారులకు బోధించారు. కథల ద్వారా వారేం తెలుసుకున్నారో అడిగారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు



బర్మాకాలనీకి వెళ్లే మార్గం దుస్థితి

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్ని గోతులుపడి, మరి కొన్ని వ్యర్థాలతో చిత్తడిగా తయారవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, స్పందించట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డు పరిధి లేబర్ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో ఇటీవల వాటర్ సప్లై అధికారులు భూగర్భంలో పైప్‌లైన్ల పనుల నిమిత్తం ఓ వైపు తవ్వారు. పనుల అనంతరం గోతుల్ని సరిగ్గా పూడ్చలేదు. దీంతో రాళ్లు తేలిపోయి, ఎగుడుదిగుడుగా రోడ్డు మారి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో అంతంత మాత్రంగా ఉన్న విద్యుత్ లైట్లతో పాదచారులు రాళ్లు తగిలి పడిపోతున్నారు. ఇదే వార్డులోని బర్మాకాలనీ రోడ్డులో మురుగునీరు నిలిచి, బురదమయంగా మారింది. దీనిపై వాహనాలు వెళ్తే అదుపు తప్పుతున్నాయి. జవహర్‌నగర్ సర్వీస్ రోడ్డులో పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను సక్రమంగా తొలగించట్లేదు. దీంతో వీటీ కాలేజ్ ప్రాంతం, సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేర నియంత్రణకు సహకరించండి



ఎన్ఏడీ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మోహనరావు

- ఆటో యూనియన్లతో సీఐ సమావేశం

గోపాలపట్నం : నేర నియంత్రణలో తమకు సహకరించాల్సిందిగా గోపాలపట్నం సీఐ ఈదుల నర్సింహరావు ఆటో యూనియన్ సభ్యులను కోరారు. స్థానిక కుమారి కల్యాణమండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఆటోలో ఎక్కేవారు, ఎక్కడ దిగుతున్నారు? అనుమానాస్పదంగా ఏమైనా వ్యవహరిస్తున్నారా? అన్న కోణంలో గమనించాలన్నారు. ఆటోల్లో నిషేధిత వస్తువులు తరలిస్తే, ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ముందు జాగ్రత్త వహించాలన్నారు. నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు ఆటో స్టాండ్ల యూనియన్ల సభ్యులు, ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి, వాటిని ఖచ్చితంగా పాటించాలని ఆటో డ్రైవర్లకు కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ వాసుదేవరావు సూచించారు. శుక్రవారం ఆయన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోడ్రైవర్లంతా యూనిఫాం ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉండాలన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఎదుటివారికి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

టెంట్ హౌస్ దగ్ధం



షాపు నుంచి ఎగసిపడుతున్న మంటలు

మల్కాపురం (విశాఖ పశ్చిమ) : విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శ్రీనివాస్‌నగర్లో గురువారం అర్ధరాత్రి ఓ టెంట్ హౌస్ నుంచి మంటలు ఎగసి పడ్డాయి. షాప్‌ను ఆనుకుని పక్కనే ఉన్న ఓ ఇంటి హౌస్ వైరింగ్ దగ్ధమైంది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. మల్కాపురం పోలీసులు చెప్పిన వివరాలు. శ్రీనివాస్‌నగర్‌లో శ్రీను అనే వ్యక్తి సప్లయర్స్(టెంట్ హౌస్) దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి తన షాపును మూసేసి, ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షాపు నుంచి మంటలు రావటం మొదలైంది. దాన్ని చూసిన స్థానికులు మంటల్ని ఆపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో పెదగంట్యాడ అగ్నిమాపక అధికారులకు, మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శకటం మంటల్ని ఆర్పేసినా, అప్పటికే సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదానికి కారణాలను అగ్నిమాపక అధికారులు చెప్పలేకపోతున్నారు. దీనిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల కొంగు బంగారం ఎర్నిమాంబ

- నేడు తొలేళ్ల సంబరం.. ఆదివారం ప్రధాన జాతర



ఎర్నిమాంబ అమ్మవారు



జ్ఞానాపురంలో వెలసిన అమ్మవారి నూతన ఆలయ గోపురం

కంచరపాలెం: సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం-అల్లిపురం అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తి శ్రద్ధలతో కొలిస్తే కోరికలు నెరవేరతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 20 శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. 21 ఆదివారం వైభవంగా ప్రధాన జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఏనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలో మాత్రమే ఇళ్లుండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రిళ్లు ఈ మార్గంలో వెళ్లేందుకు అందరూ భయపడేవారు. గత నలభై ఏళ్లుగా నివాసితులు పెరగడంతో రోడ్లన్నీ విస్తరించాయి. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్డు విస్తరించారు. వందేళ్లుగా ఆలయం ఉన్నప్పటికీ గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లని పూర్వీకులు చెబుతుంటారు. జ్ఞానాపురంతో పాటు అల్లిపురం అచ్చియ్యమ్మపేట గ్రామదేవతగా ఆయా గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తుల కోలాహలం..

అమ్మవారిని ఆది, మంగళ, గురువారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటుంటారు. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర ప్రాంతాల నుంచి కుడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటావార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. స్థానికులే అమ్మవారి పేరిట సంఘాన్ని ఏర్పాటు సేవలందిస్తున్నారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు.

మా ఇంటి ఇలవేల్పు..



చాలా కాలంగా మా ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నాం. అమ్మవారిని దర్శించుకున్న తరువాతే ఏ పనైనా చేస్తాం. భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు తప్పక తీరుతాయి.

–బంటుపల్లి నూకరాజు, గురుస్వామి, పూర్ణామార్కెట్,

అమ్మ దీవెనలు చల్లగా..



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ అమ్మవారి పేర్లే. సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా జీవిస్తాం. అమ్మను నిత్యం పూజలతో కొలుస్తాం.

–వానుపల్లి విజయ, భక్తురాలు, అచ్చియ్యమ్మపేట.

827వ రోజుకు ఉక్కు నిరాహార దీక్షలు

కూర్మన్నపాలెం: దేశంలోని రైతుసంఘాలు, ప్రజాసంఘాలు, యువజన సంఘాలను కలుపుకొని ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి తద్వారా ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 827వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఉక్కు కర్మాగారంలోని ప్రతి విభాగంలో పోరాట కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, తద్వారా దీక్ష శిబిరంలో కార్మికుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.